నమస్తే తెలంగాణ
ఖమ్మం
5 | ఖమ్మం, శుక్రవారం 15 నవంబర్ 2024 | KHAMMAM

# కాంగ్రెస్ తప్పులను ఊరూరా వివరించాలి

- ప్రజా సమస్యలు గాలికొదిలి టైంపాస్ రాజకీయాలు
- రుణమాఫీ, రైతు భరోసాపై నేతలది రోజుకో మాట
- బీఆర్ఎస్ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు
- మణుగూరులో పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం


మణుగూరు పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న రేగా, బీఆర్ఎస్ శ్రేణులు

మణుగూరు టౌన్, నవంబర్ 14 : ఎన్నో హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న ప్రతీ తప్పును ఊరూరా ప్రజలకు వివరిస్తూ ముందుకు సాగాలని, ఎన్నికలు ఎప్పుడు వచ్చినా విజయం బీఆర్ఎస్‌దేనని బీఆర్ఎస్ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు అన్నారు. బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశం మణుగూరు పట్టణంలో గురువారం నిర్వహించారు. తొలుత పట్టణంలో రేగా ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించి తెలంగాణ తల్లి విగ్రహానికి, డాక్టర్ బీఆర్ అంబేద్కర్, కుమ్రంభీం విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సమావేశంలో రేగా కాంతారావు మాట్లాడుతూ అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ప్రజా సమస్యలను గాలికొదిలేసి టైంపాస్ రాజకీయాలు చేస్తున్నదని, గవర్నెన్స్‌ను పెంచుకునే ప్రయత్నం చేయకుండా అనుభవ లేమితో ఇష్టారీతిగా వ్యవహరిస్తున్నదని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న తప్పులను బీఆర్ఎస్ శ్రేణులు క్షేత్రస్థాయిలో విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. రైతు భరోసా, రుణమాఫీ విషయంలో రోజుకో మాట చెబుతున్న ప్రభుత్వ పెద్దల తీరు గురించి రైతులకు అర్థమయ్యే రీతిలో వివరించాలన్నారు. గ్రామ గ్రామాన బీఆర్ఎస్ పార్టీ పునర్నిర్మాణం చేపట్టి పంచాయతీలు, గ్రామాల్లో కమిటీలు వేస్తామన్నారు. నాయకులు, కార్యకర్తలు ఆవేశంతో నిర్ణయాలు తీసుకోవద్దని, పార్టీ మారితే మళ్లీ రానిచ్చేది లేదని ఆయన తెగేసి చెప్పారు. పదవులు రావాలంటే ప్రతీ ఒక్కరూ కష్టపడి పని చేయాలని, అప్పుడు గుర్తింపుతో పాటు పదవులు దక్కుతాయన్నారు. సర్పంచ్‌లుగా బరిలో నిలిచే అభ్యర్థులు గ్రామాలు విడిచి రావొద్దని, వంద శాతం పాత వారికే అవకాశం ఉంటుందని ఆయన భరోసా ఇచ్చారు. ఉప ఎన్నికలు వస్తే భద్రాచలంలో పార్టీ అభ్యర్థి పోటీ చేయనున్నట్లు చెప్పారు. అనంతరం రేగా కాంతారావును, నూతనంగా ఎన్నికైన పార్టీ కన్వీనర్, కో కన్వీనర్లను ఘనంగా సన్మానించారు. సమావేశంలో పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# 104 కేజీల గంజాయి పట్టివేత


ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పట్టుకున్న గంజాయి

పాల్వంచ, నవంబర్ 14 : ఒడిశా రాష్ట్రం మల్కాన్‌గిరి నుంచి హైదరాబాద్‌కు అక్రమంగా తరలిస్తున్న 104 కేజీల గంజాయిని ఖమ్మం ఎక్సైజ్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పట్టణంలోని ఇందిరాకాలనీ జీసీసీ కార్యాలయం వద్ద మాటు వేసి గురువారం రాత్రి పట్టుకున్నారు. బెంగళూరు సోమనహళ్లికి చెందిన దిలీప్‌కుమార్, కట్టా హర్షిత్, మల్కాన్‌గిరికి చెందిన సంజీవ్ మండల్, సునీల్ రేలు కారులో గంజాయి తరలిస్తుండగా పక్కా సమాచారం మేరకు జాతీయ రహదారిపై అధికారులు పట్టుకున్నారు. కారుతోపాటు ఒక స్పోర్ట్స్ బైక్, నాలుగు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అదుపులోకి తీసుకొని పాల్వంచ ఎక్సైజ్ కార్యాలయానికి తరలించారు. పట్టుకున్న గంజాయి విలువ రూ. రూ.20 లక్షలు ఉంటుందని అధికారులు తెలిపారు. దాడిలో ఖమ్మం ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ గణేశ్, సీఐ శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

# లంచావతారులు..!

## రోజురోజుకూ పెరిగిపోతున్న లంచగొండి ఉద్యోగులు

ఆళ్లపల్లి మండలంలో ఏసీబీకి చిక్కిన ఎంపీవో, పంచాయతీ సెక్రటరీ (ఫైల్)





పాల్వంచ మున్సిపాలిటీలో ఇంటి నెంబర్ కోసం లంచం తీసుకుంటూ పట్టుబడిన టీపీఎస్, అసిస్టెంట్ (ఫైల్)



- ప్రభుత్వ కొలువు నుంచి తీసేయలేరనే ధీమా
- ఏసీబీకి చిక్కుతున్నా మారని తీరు
- ఏడాదిలోనే పట్టుబడిన పది మంది
- భద్రాద్రి జిల్లాపై అవినీతి మరకలు
- కొరవడిన ఉన్నతాధికారుల అజమాయిషీ
- గాడి తప్పిన కాంగ్రెస్ పాలన

భద్రాద్రి కొత్తగూడెం, నవంబర్ 14 (నమస్తే తెలంగాణ) : ప్రభుత్వ ఉద్యోగులుగా విధులు నిర్వర్తించినందుకు నెలనెలా ఠంచనుగా వేతనం తీసుకుంటున్నా.. అది చాలదనట్లు ఆమ్యామ్యాలకు మరిగి కొందరు అధికారులు పక్కచూపులు చూస్తున్నారు. పని ఏదైనా సదరు బాధితుల నుంచి రూ.వేలు, లక్షల్లో డిమాండ్ చేస్తూ ఏసీబీ అధికారులకు అడ్డంగా దొరికిపోతున్నారు. ఏడాది కాలంలోనే పది మంది ఉద్యోగులు ఏసీబీ అధికారులకు పట్టుబడి పవిత్ర భద్రాద్రి జిల్లాకు అవినీతి మరకలు అంటించారు. ఒక శాఖలో అధికారి ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారనే భయం కూడా లేకుండా లంచాలే ప్రధాన ధ్యేయంగా వివిధ శాఖల్లో కొందరు అధికారులు, సిబ్బంది పని చేస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. గత కేసీఆర్ ప్రభుత్వ హయాంలో బాధ్యతగా పనిచేసిన అధికారులు.. కాంగ్రెస్ పాలనలో కొందరు అధికారులు, సిబ్బంది బరితెగించి లంచాలు తీసుకుంటూ ఏసీబీ అధికారులకు చిక్కుతున్నారు. ప్రభుత్వ కొలువే కదా.. తమను సర్వీసు తొలగించేది ఎవరనే ధీమాతో ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నట్లు తెలుస్తున్నది.

### గాడి తప్పిన పాలన

గత కేసీఆర్ పాలనలో పదేళ్లు అంతా సాఫీగా సాగిపోయింది. వివిధ శాఖల్లో సామాన్యుల సమస్యలను అధికారులు వెనువెంటనే పరిష్కరించేవారు. కానీ.. కాంగ్రెస్ పాలన షురువైన నాటినుంచి పైరవీలకే ప్రథమ ప్రాధాన్యం అనేలా ఉంది పరిస్థితి. కిందిస్థాయి సిబ్బందిపై ఉన్నతాధికారుల అజమాయిషీ లేకపోవడంతో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ అవినీతి అక్రమాలకు పెద్దపీట వేసినట్లైంది. కనీసం కలెక్టరేట్ భవన సముదాయంలో విధులు నిర్వర్తిస్తున్నామనే భయం కూడా లేకుండా ఓ హార్టికల్చర్ అధికారి ఏకంగా రూ.లక్ష లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు చిక్కిన విషయం తెలిసిందే. ఇలా ఏడాదిలోపే పది మందికిపైగా ఉద్యోగులు ఏసీబీ వలలో చిక్కుకొని ఊచలు లెక్కిస్తున్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాకు ముగ్గురు మంత్రులు ఉన్నా.. అధికారులకు ఎలాంటి భయంలేకుండా లంచాలు తీసుకోవడంలో పెట్రేగిపోతున్నారు.

### భరించలేక ఏసీబీని ఆశ్రయిస్తున్న బాధితులు

జిల్లాలో రోజురోజుకూ లంచావతారులు ఎక్కువవుతున్నారు. ఒక శాఖ అని కాదు.. అన్ని శాఖల్లోనూ అదే తీరు కనిపిస్తున్నది. డిప్యూటేషన్ల పేరుతో, విద్యుత్ శాఖలో ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు, ఫిర్యాదుదారులు ఠాణాకు వెళ్తే డబ్బులు డిమాండ్ చేయడం, దొడ్డిదారిలో బదిలీలు చేయడంతోపాటు సెలవులు కావాలన్నా, ఇంక్రిమెంట్లు చేయాలన్నా లంచాలకు మరింత డిమాండ్ పెరిగింది. ట్రెజరీ కార్యాలయాల్లో కూడా కమీషన్లు బాగా పెరిగినట్లు ఉద్యోగులే బహిరంగంగా చెప్పుకుంటున్నారు. వీటిపై ఏసీబీ అధికారులు మరింత దృష్టి సారిస్తే చాలా శాఖల ఉద్యోగులు కూడా చిక్కే అవకాశాలు లేకపోలేదు.


పాల్వంచలో ఏసీబీకి చిక్కిన విద్యుత్ శాఖ లైన్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు (ఫైల్)

### లంచం అడిగినా అరెస్టు చేయొచ్చు..



లంచం ఇచ్చే స్థాయి, స్తోమత లేక పలువురు బాధితులు ఏసీబీ అధికారులను ఆశ్రయిస్తున్నారు. లంచం అడుగుతున్నారని మాకు సమాచారం అందించిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతున్నాం. అధికారులు ఫోన్‌లో లంచం అడిగినా తప్పే అవుతుంది. కాల్ రికార్డులను సైతం పరిశీలిస్తున్నాం. రేగళ్ల పంచాయతీ కార్యదర్శిని అలాగే పట్టుకున్నాం. జిల్లాలో ఏడాదిలోపే 10 మందిని అరెస్టు చేశాం. ఇంకా చాలా మంది బాధితులు మాకు ఫోన్లు చేస్తున్నారు. – రమేశ్, డీఎస్పీ ఏసీబీ

### ఏడాదిలోపే ఏసీబీకి చిక్కిన ఉద్యోగులు వీరే..

పోటీపడి లంచాలు తీసుకుంటూ కొందరు అధికారులు, ఉద్యోగులు ఏసీబీ అధికారులకు పట్టుబడుతున్నారు. భద్రాద్రి జిల్లాలో ఏడాదిలోపే 10 మంది ఉద్యోగులు ఏసీబీకి అడ్డంగా దొరికిపోయారంటే లంచగొండులు ఏ స్థాయిలో ఉన్నారో అర్థం చేసుకోవచ్చు.

- భద్రాచలంలో టౌన్ ఎస్ఐ శ్రీనివాస్ బాధితుడి వద్ద లంచం తీసుకుంటూ దొరికిపోయారు.
- పాల్వంచ మున్సిపాలిటీలో ఇంటి నెంబర్ ఇవ్వడం కోసం టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్‌తోపాటు మరో అసిస్టెంట్ డబ్బులు తీసుకుంటూ ఏసీబీకి చిక్కారు.
- అశ్వారావుపేట మండలం భీమునిగూడెం గ్రామానికి చెందిన రైతు పొలం వద్ద ట్రాన్స్‌ఫార్మర్ వేయడం కోసం విద్యుత్ శాఖ ఏఈ లంచం తీసుకుంటూ పట్టుబడ్డారు.
- చర్ల మండలంలో రైతు పట్టాలో పేరు మార్చడం కోసం లంచం తీసుకుంటూ డిప్యూటీ తహసీల్దార్ భరణిబాబు ఏసీబీకి చిక్కారు.
- ఆళ్లపల్లి మండలంలో ఇంటి నెంబర్ల విషయంలో బాధితుల వద్ద లంచం తీసుకుంటూ ఎంపీవో, పంచాయతీ కార్యదర్శి ఇద్దరూ అడ్డంగా బుక్కయ్యారు.
- పాల్వంచ పట్టణంలో ఎస్ఐ రాము లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు చిక్కారు.
- పాల్వంచలో మరో ఉద్యోగి, విద్యుత్ శాఖ లైన్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు బాధితుడి వద్ద లంచం తీసుకుంటూ రెడ్‌హ్యాండెడ్‌గా దొరికిపోయారు.
- కొత్తగూడెం ఐడీవోసీలో జిల్లా హార్టికల్చర్ అధికారి సూర్యనారాయణ కాంట్రాక్టర్ వద్ద రూ.లక్షకు పైగా లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డారు.
- పాల్వంచలో మెడికల్ కాలేజీలో అవుట్ సోర్సింగ్ జీతాల బిల్లులు చేయడం కోసం లంచం తీసుకుంటూ కళాశాల ఏవో, జూనియర్ అసిస్టెంట్లు ఏసీబీకి చిక్కారు.
- లక్ష్మీదేవిపల్లి మండలం రేగళ్ల గ్రామ పంచాయతీ సెక్రటరీ బాధితుడి వద్ద లంచం అడిగి అడ్డంగా బుక్కయారు.

# సృజనాత్మకతను వెలికి తీయాలి

**భద్రాద్రి కలెక్టర్ జితేశ్ వి పాటిల్**


మాట్లాడుతున్న కలెక్టర్ జితేశ్ వి పాటిల్

భద్రాద్రి కొత్తగూడెం, నవంబర్ 14 (నమస్తే తెలంగాణ) : పిల్లల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీయడానికి కృషి చేయాలని భద్రాద్రి కలెక్టర్ జితేశ్ వి పాటిల్ అన్నారు. మహిళా, శిశు, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మిషన్ వాత్సల్య పథకం కింద బాలల దినోత్సవం వేడుకలను ఐడీవోసీలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చిన్నారులను ఎంతగానో ప్రేమించే జవహర్‌లాల్ నెహ్రూ జ్ఞాపకార్థం ప్రతీ సంవత్సరం బాలల దినోత్సవం జరుపుకుంటున్నామన్నారు. అనంతరం వివిధ పాఠశాలల విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు, ఐటీడీఏ మనోవికాస్ పాఠశాల దివ్యాంగ విద్యార్థుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. తర్వాత వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను కలెక్టర్ అభినందించారు. అలాగే బీఎస్సీ నర్సింగ్ చేయడానికి విద్యార్థిని కుసుమకుమారికి ఎన్ఆర్ఐ తోటకూర రమేశ్ అందించిన రూ.లక్షను కలెక్టర్ ద్వారా అందజేశారు. అనంతరం ది ఇన్నర్ వరల్డ్ ఆఫ్ చిల్డ్రన్ అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విద్యాచందన, మహిళా, శిశు సంక్షేమాధికారి లెనీనా, సీడబ్ల్యూసీ చైర్మన్ భారతరాణి, సుమిత్రాదేవి, సాధిక్ పాషా, అంబేద్కర్, విద్యార్థులు పాల్గొన్నారు.

# గిరిజన విద్యార్థులకు సకల సౌకర్యాలు

**ట్రైకార్ జీఎం శంకర్‌రావు**


మాట్లాడుతున్న ట్రైకార్ జీఎం శంకర్‌రావు

భద్రాచలం, నవంబర్ 14 : గిరిజనులు, కొండరెడ్ల విద్యార్థులకు సకల సౌకర్యాలు కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం ధర్తీ ఆభ భగవాన్ బిర్సాముండ 150వ జయంతి సందర్భంగా ప్రత్యేక పథకాన్ని ప్రవేశపెట్టిందని ట్రైకార్ జీఎం శంకర్‌రావు తెలిపారు. భద్రాచలం ఐటీడీఏ కార్యాలయంలో యూనిట్ అధికారులతో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గిరిజన విద్యార్థుల కోసం ప్రవేశపెట్టిన ఈ పథకాన్ని ప్రధాని మోదీ వర్చువల్ విధానం ద్వారా ప్రారంభిస్తారని తెలిపారు. గిరిజన విద్యార్థులకు వివిధ సంక్షేమ పథకాల అమలు, ఆశ్రమ, వసతి గృహాల్లో సంస్కృతీ సంప్రదాయలను నేర్పించడం ఈ పథకం కింద చేపడుతారన్నారు. వైద్య ఆరోగ్య శాఖ ద్వారా ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఐటీడీఏ ఏపీవో డేవిడ్‌రాజు, సుశీల్, ఏవో రాంబాబు, డీటీఆర్‌వోఎఫ్ఆర్ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

# బొగ్గు నాణ్యతా వారోత్సవాలు ప్రారంభం


ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

కొత్తగూడెం సింగరేణి, నవంబర్ 14 : సింగరేణి కార్పొరేట్ క్వాలిటీ డిపార్ట్‌మెంట్ కార్యాలయంలో బొగ్గు నాణ్యతా వారోత్సవాలను డైరెక్టర్ సత్యనారాయణరావు ప్రారంభించారు. గురువారం సంస్థ వ్యాప్తంగా ఉన్న అన్ని డిపార్ట్‌మెంట్‌లు, ఎస్‌టీపీపీ థర్మల్ ప్లాంట్‌లో వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పతాకాన్ని ఎగురవేశారు. 134 సంవత్సరాల చరిత్ర కలిగిన సింగరేణిలో నాణ్యమైన బొగ్గును సరఫరా చేస్తూ దేశ ఆర్థిక ప్రగతిలో సుస్థిర స్థానం సంపాదించుకుందన్నారు. ప్రస్తుత పోటీ మార్కెట్‌లో ఇతర బొగ్గు సంస్థలకు దీటుగా సింగరేణి సంస్థ కూడా తన బొగ్గు నాణ్యతా ప్రమాణాలను పాటిస్తుందన్నారు. ఈ సందర్భంగా ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో క్వాలిటీ జీఎం రవికుమార్, సుశాంత్ పాషా, ఎలిషా, ఎస్వోటు డైరెక్టర్ కేవీ రావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

# గ్రూప్-3 పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించాలి


- కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్
- అభ్యర్థులు సకాలంలో చేరుకోవాలి



ఖమ్మం, నవంబర్ 14 : తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్దేశించిన నిబంధనలను పాటిస్తూ అభ్యర్థులు ప్రశాంతంగా గ్రూప్-3 పరీక్షలకు హాజరుకావాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నవంబర్ 17వ తేదీ ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు, మధ్యాహ్నం 3నుంచి సాయంత్రం 5:30 వరకు రెండు సెషన్లు, నవంబర్ 18వ తేదీన ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12:30 వరకు గ్రూప్-3 పరీక్షలు జరుగుతాయని, ఖమ్మంజిల్లాలో మొత్తం 27,984 మంది అభ్యర్థులు పరీక్షలు రాయనున్నారని, వీరికోసం 87 పరీక్షా కేంద్రాలను సిద్ధం చేసినట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాలకు అభ్యర్థులను ఉదయం సెషన్‌లో 8:30 నుంచి, మధ్యాహ్నం సెషన్‌లో 1:30 నుంచి అనుమతిస్తారని, పరీక్షాకేంద్రాల గేట్లు ఉదయం 9:30 గంటలకు, మధ్యాహ్నం 2:30 గంటలకు మూసివేస్తామని, తర్వాత ఎవ్వరినీ అనుమతించరని, అభ్యర్థులు సకాలంలో చేరుకోవాలని సూచించారు. అభ్యర్థులు పరీక్షా కేంద్రాలకు తమ వెంట బ్లూ, బ్లాక్ పాయింట్ పెన్నులు, ఫొటోతో కూడిన హాల్‌టికెట్, ప్రభుత్వం జారీ చేసిన ఒరిజినల్ ఫొటో ఐడీ కార్డు తీసుకురావాలని తెలిపారు. హాల్‌టికెట్‌లో ఫొటో సరిగ్గా లేకపోతే అభ్యర్థి 3 పాస్ ఫొటోలు గెజిటెడ్ అధికారి లేదా చివర చదివిన విద్యాసంస్థ ప్రిన్సిపాల్ సంతకంతో తీసుకొచ్చి పరీక్షాహాల్‌లో ఇన్విజిలేటర్‌కు అప్పగించాలన్నారు. అభ్యర్థులు పరీక్షా కేంద్రానికి ఒకరోజు ముందుగా వెళ్లి చూసుకోవాలని సూచించారు. క్యాలిక్యులేటర్, పేజర్, సెల్‌ఫోన్, ట్యాబ్, పెన్‌డ్రైవ్, బ్లూటూత్ డివైజెస్, వాచ్, మ్యాథమెటికల్ టేబుల్, లాగ్‌టేబుల్, హ్యాండ్‌బ్యాగ్స్, జోలాస్, పౌచెస్, రైటింగ్ ప్యాడ్స్, నోట్స్, చార్ట్స్, లూజ్ షీట్స్, జ్యువెలరీ (మంగళసూత్రం, గాజులు సంబంధ ఐటెంలు మినహాయించి), ఎలక్ట్రానిక్ గాడ్జెట్ మొదలగు సామగ్రి తీసుకురావడానికి వీల్లేదని, చెప్పులు మాత్రమే వేసుకుని రావాలని, షూస్ వేసుకోవద్దని పేర్కొన్నారు. బయోమెట్రిక్ ఇవ్వని అభ్యర్థుల ఓఎంఆర్ షీట్ వ్యాలీడ్ కాదని, బయోమెట్రిక్ విధానం ఉన్న నేపథ్యంలో అభ్యర్థులు మెహందీ, టాటూ వంటివి పెట్టుకోవద్దని తెలిపారు. ప్రతి పేపర్ సమయంలో అభ్యర్థి ఇన్విజిలేటర్ సమక్షంలో హాల్‌టికెట్‌పై సంతకం పెట్టాలన్నారు. మోడల్ ఓఎంఆర్ షీట్లను వెబ్‌సైట్ నుంచి డౌన్లోడ్ చేసుకుని సరిగ్గా బబుల్స్ చేయడం ప్రాక్టీస్ చేయాలని, ఓఎంఆర్ షీట్‌ను సరిగా చెక్ చేసుకోవాలని, పరీక్ష పూర్తయ్యే వరకు అభ్యర్థులు పరీక్ష హాల్ విడిచి వెళ్లడానికి వీలులేదని ప్రకటనలో పేర్కొన్నారు.

# వేతనాలు ఇప్పించండి సారూ..

**కలెక్టర్‌కు గ్రామ పంచాయతీ వర్కర్ల వినతి**


కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న జీపీ వర్కర్స్ అసోసియేషన్ నేతలు

ఖమ్మం సిటీ, నవంబర్ 14 : 'నాలుగైదు నెలలుగా వేతనాల్లేవు.. అయినా మురికి పనులు చేస్తూనే ఉన్నాం.. పస్తులతోనే బతుకు బండిని లాగించుకుంటూ వస్తున్నం.. ఇక మా వల్ల కావట్లేదు.. తక్షణమే పెండింగ్‌తో కలిపి మొత్తం వేతనాలను ఇప్పించండి సారూ' అంటూ గ్రామ పంచాయతీ వర్కర్లు కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్‌ను వేడుకున్నారు. గురువారం కలెక్టరేట్‌లో తెలంగాణ గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ముఖ్యనేతలు ఆయనకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు పలు అంశాలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. మునుపెన్నడూ ఇటువంటి దుస్థితి నెలకొనలేదన్నారు. గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న వారంతా నిరుపేదలేనని, నెలల తరబడి వేతనాలు చెల్లించకుంటే చేతిలో చిల్లిగవ్వ లేక తీవ్ర అవస్థలు పడుతున్నామని ఆవేదన వ్యక్తంచేశారు. కుటుంబ సభ్యులకు కడుపునిండా అన్నం కూడా పెట్టలేకపోతున్నామని వాపోయారు. సానుకూలంగా స్పందించిన కలెక్టర్ ఖాన్ వేతనాలు వెంటనే అందించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. నాయకులు కే నాగరాజు, పంగలాలయ్య, ఎస్కే హుస్సేన్, నాగేశ్వరరావు, గౌతమ్, రామకృష్ణ, సైదులు, కొమరయ్య, రామారావు, వెంకన్న పాల్గొన్నారు.

### 17న బహిరంగ విచారణ

ఖమ్మం, నవంబర్ 14 : స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ దామాషాపై ఈ నెల 17వ తేదీన బహిరంగ విచారణ చేస్తున్నామని, ఆసక్తి కలిగిన బీసీ కులసంఘాలు, ప్రజా ప్రతినిధులు, ఇతర కులసంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, రాజకీయ పార్టీలు, ప్రజలు హాజరై వారి అభిప్రాయాలను తెలియజేయాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల ప్రకారం.. స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ దామాషా ఖరారు చేసేందుకు బీసీ కమిషన్ డెడికేషన్ చైర్మన్ భూసాని వెంకటేశ్వరరావు, సెక్రటరీ బి.సైదులు ఆధ్వర్యంలో ప్రజాభిప్రాయ సేకరణ జరుపనున్నట్లు తెలిపారు. ఈ నెల 17వ తేదీన ఉదయం 11:30 నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు ఖమ్మం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల ప్రజల అభిప్రాయాలు తెలుసుకునేందుకు బహిరంగ విచారణ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆయా కులాల స్థితిగతులపై డెడికేటెడ్ కమిషన్‌కు వ్యక్తులు, నమోదిత, నమోదు కాని అసోసియేషన్లు వారి వాదనలకు మద్దతుగా వారి వద్ద ఉన్న సమాచారం మెటీరియల్ సాక్ష్యాలను, సంబంధిత విషయాలను పేర్కొంటూ స్థానిక సంస్థల వారీగా కల్పించాల్సిన, అవసరమైన రిజర్వేషన్ల దామాషాను పేర్కొనే విషయంలో సమర్పణలు, అభ్యర్థనలు, సలహాలు కమిషన్ ఎదుట తెలియజేయాలని ప్రకటనలో పేర్కొన్నారు.

# శివ పూజకు వేళాయె...


కూసుమంచిలో విద్యుత్ దీపాలతో కాకతీయుల నాటి శివాలయం, ముస్తాబైన శివలింగాకారం

- కార్తీక పౌర్ణమి సందర్భంగా ముస్తాబైన శివాలయాలు
- తెల్లవారుజాము నుంచే మార్మోగనున్న శివనామస్మరణ

కూసుమంచి, నవంబర్ 14 : కార్తీక పౌర్ణమి వేడుకలకు జిల్లాలోని శివాలయాలు ముస్తాబయ్యాయి. శుక్రవారం తెల్లవారుజాము నుంచే మహిళలు ఆలయాలను సందర్శించి ప్రమిదల్లో ఒత్తులు వేసి దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు చేయనున్న నేపథ్యంలో అందుకు తగ్గట్లుగా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. కూసుమంచిలోని కాకతీయుల నాటి శివాలయాన్ని కార్తీక పౌర్ణమి సందర్భంగా రంగు రంగుల పూలు, విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఆలయానికి వచ్చే భక్తుల కోసం క్యూలైన్లు ఏర్పాటు చేయడంతో పాటు ప్రసాదాల పంపిణీ, మంచినీటి వసతి, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించేందుకు సర్వం సిద్ధం చేశారు. ఆలయ ప్రాంగణంలోని హనుమాన్ గుడి, సుబ్రమణ్యేశ్వరస్వామి, సరస్వతీదేవి ఆలయ ప్రాంతాలను విద్యుత్ దీపాలతో ముస్తాబు చేశారు. తెల్లవారుజామున 4 గంటల నుంచి పూజారి దేవులపల్లి శేషగిరి శర్మ ఆధ్వర్యంలో అభిషేకాలు, పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఆలయ చైర్మన్ రేలా ప్రదీప్‌రెడ్డి, కమిటీ సభ్యులు, ఈవో శ్రీకాంత్, సిబ్బంది ఏర్పాట్లను పర్యవేక్షించారు.